# "బువ్వ లేకుంటెట్ల బుతకతవ్"

మల్లెడ్డికి రొండెడ్లున్నయి. ఓ పెద్దకచ్చురముంది. రొండు మూడెకురాల బూముంది. ఉన్న బూమిని హితం జేసుకుంట బతుకుతడు మల్లెడ్డి. తన బూమిల ఇత్తున మేసినంక తీరిక దొరుకుతె బండి కిరాయలకు గొడుతడు. కైకలికి నాగలి గడుతడు. పెయ్యి దాసుకోకుంట పనిజేత్తడు. పంటోతీరుగనే పండిత్తడు. అయితె అందరెవుసదార్లకున్నట్టె మల్లెడ్డికి గూడ బాకీలున్నయి. కని గివ్వీటికైనె బయపడడు. అందరోలె మల్లెడ్డి తను సేసే పనిల అంత నట్టమేనని అసలే అనడు. గిండ్లేం పాడైందే అని గులుగడు. తన పనంటె అయినెకు మంచి గౌరవం, అభిమానం గూడ. తనసోంటోల్లు పంట పండిచ్చేప్పటికినే అందరికన్నం దొరకుతందంటడు. దేశానికన్నమందిచ్చేది తనలాంటి రైతేనంటడు. ఎవుసదారుడే ససంత్రంగ బతుకుతండంటడు. తన పనిమీద అభిమానంతో తన పనినెప్పుడు గూడ తక్కోదనుకోలే.

మల్లెడ్డి తమ్ముడు నౌకరిజేసుకుంట మల్లెపూలసోంటి తెల్లబట్టల్తోని తిరుగతె, తనతోని సిన్నప్పుడు సదువుకున్నోల్లు స్కూటర్లమీద ఇంటికత్తంటె తనకున్న ఎడ్లబండింజూసి అస్సలే అవుమానపల్లేదు. తన పని గురించెవ్వలన్న అగవురంగ మాట్లాడితె ఊకోడు. నేసిన బట్టతోని కుట్టిచ్చిన అపారం అంగీ, దొడ్డు ధోతీ కట్టుకొనుండె మల్లెడ్డి సాగవారినట్టుంటడు. తనుసేసె పనిమీద మంచి ప్రేమున్న మల్లెడ్డంటె నాకిష్టం. సిన్నప్పట్నుంచయినె నాకెరికే.

ఓనాడు నేనున్న నా సోపతికాల్లిద్దరు కచ్చీరు గద్దెమీద కూసున్నం. అదోటిదోటి మాట్లాడుకుంటున్నం. ఇద్దరు దోస్తులతోని తాళ్ళళ్ళకు పొయ్యి కల్లుదాగి ఇంటిమొకాన పోతండు మల్లెడ్డి. నేనయినెంజూసి మాట్లాడిచ్చినట్టు నవ్విన. ఆగి నాదగ్గెరికచ్చి నిల్సున్నరాల్లు. మాసిపెయిన బట్టల్తోని కాల్లపొంటి దుమ్ముతోని సిక్కిరిబిక్కిరున్న ఎంటికల్తోనున్న మల్లెడ్డి ఆ ముగ్గుర్ని సూసి నా పొంటున్నోల్లు నవ్విండ్రు. హేళన సేసినట్టు కిసుక్కుమన్నరు.

"ఏన్నుంచత్తండ్రు పటేల?"

"ఇంకేన్నుంచి? తాల్లల్లకెల్లే"

మల్లెడ్డాల్లిద్దర్ని అలోదోరుగ సూసిండు.

"మేం మోటుకట్టం సేసెటోల్లం. మీ తీరుగ శానిగుండం, పొయ్యిపొయ్యలిట్టతోనచ్చి బింకెడంత తెల్లగల్లు తాగుతం. మీకేమొ బీరుబ్రాందీలు దొరికె. మాకు గవ్వేడ దొరుకాలె" అన్నడు మల్లెడ్డి

"పదేలు బాగనే మాట్లాడ్తరో?" అన్నడు పదేలన్న కాడ ఒత్తిపట్టి మా అండ్లనుంచొకడు.

మల్లెడ్డి సెర్రుకచ్చిండు.

"మేం పదేండ్ల మెట్లయితమయ్య! ఎద్దుముడ్డి పొడ్సుకుంట బతికెటోల్లం. కూసుండి తినెటోల్లు మిమ్ములను పదేండ్లంటె నడుత్తది" అన్నడు.

"అబ్బో ఈల్లబట్టల్జాడు ఈల్ల జూడు. గీల్లగ్గాడ మాటలు బాగనే" అన్నడింకొగడు.

ఇగ మల్లెడ్డందుకున్నడు.

"అంటె నువ్వు సేసే పని దండిదంటవ్" అంతేనా!

"కాకుంటేంది? నీ తీరుగ పొద్దుందాక మంట్లె బొర్లుతన్ననా?" మొదటోడు కాలరెగొరేసుకుంటన్నడు.

"నువ్వేం జేత్తన్నవు?" అడిగిండు మల్లెడ్డి.

"సింగరేణిల క్లర్కు పని.

"నువ్వే జేత్తన్నవే" రొండోన్నడిగిండు.

"కరెంటాపీసుల రాత పని"

"నువ్వేం జేత్తన్నవే?" నన్నడింగు.

"ఎరువుల కంపిన్ల మందుల పరీచ్చ" అన్న నేను.

"అంటె మీరందరు జేసెటియి నౌకర్లే గద" అన్నడు మల్లెడ్డి.

"అవు నౌకర్లే. అయితేంది?" అన్నడు మొదటోడు

"అంటె ఒగలు బొగ్గుగాసెదాంట పన్జేత్తరు, ఇంకోగలు కరెంటుదాంట్ల, ఇంకోగలు మందులయ్యెదాంట్ల. మరి మీరందరేం దింటరు?" మెల్లెగడిగిండు మల్లెడ్డి. "ఎవ్వలయినేం దింటరు? అన్నం"

"మీరు జేసేటియి నౌకర్లు. అంటె ఒగనికింద పాలే[illegible]పడసొంటియే. మీ మీదున్నోడు సెప్పింది మీరు సెయ్యాలె. ఆడు తిడితె పడాలె. యాల్ల కు[illegible]లె. ఇట్టమున్నప్పుడింటికి రారాదు. కని పని కొద్ది గలుకలగుంటదేమొ. అంటె మీరు పెద్ద పాలేర్లన్నట్టే లెక్క.

కని మేం జూడు. గీ రెక్కల కట్టంజేసి పంట పండిత్తం. మేం మా ఇష్టముంటె పనిజేత్తం.

లేకుంటె సాపుకపంటం. మమ్ములను కొనాయనెటోడు లేడు. మరి మీకు గట్లుందా సెప్పు? మల్ల మేం జేసేది పెద్దపనని నీల్గుతంద్రు. మమ్ములనెగతాల్జేత్తంద్రు. మీరు దీసె బొగ్గులేకుంటె బతుకచ్చు. కరెంటు లేకున్నా బతుకుడు పెద్ద కష్టమేం గాదు. గదిప్పుడు గూడ మా ఇంట్ల లేదు. ఎరువులేకున్నా ఎంతో కొంత పంట పండియ్యచ్చు. గొర్ల. బర్ల ఎరువు వాడచ్చు. పెంట బొయ్యచ్చు. కని మేం పండిచ్చే పంటున్నది సూడు. గీ బొక్కలన్ని కలికలిగాంగ రాత్రిపగలు కష్టపడి పండిచ్చే పంటున్నది సూసినవా? గా బువ్వ తినకుంటె మీరు బతుకరు. మీరేంది ఈ దేశాన్నేలే రాజుగూడ బతుకడు. ఎవ్వలైన ఎంత పెద్దోడైన మేం పండిచ్చిన పంట బువ్వే తినాలె. గీ బొక్కలన్ని కలికలి గాంగ రాత్తిరి పగలు కష్టపడి, మారగుతం సెమటగాంగ పండిత్తున్న పంటనే మీరు తింటంద్రు. మరి గా పంట లేకుంటెవ్వలు బతుకుతరో సెప్పుంద్రి. మీరు సేసే బొగ్గు. కరెంటు. ఎరువు, రాసే రాతలు గివ్విట్ని తిని బతుకుతరా సెప్పుంద్రి!" మీరు నౌకరి సేసినా ఎన్ని పైసలు సంపాయిచ్చినా, ఎవ్వలే పనిజేసినా, ఎంత గొప్పోల్లయినా ఇగో గీ మా రెక్కల కష్టంతోని సేసిన పంటనే తినాలె. గద్దినే బతుకాలె. కాదంటరా సెప్పుంద్రి.

ఒగనికింద పాలేరోనోలె నౌకరుండి మమ్ముల్నే హేళన జేత్తరా? మీరు జేసేదేపాటి దండె పనో కొంచెమంత చెప్పుతరా? మేం సంతంగ కష్టపడి పంట పండిచ్చుకుంట మేం దినుకుంట ఇంకొగల కింత పెడుతన్నం. మీరు జేసేది గొప్ప పనో, మేం జేసేదో సెప్పుంద్రి. నిలదీసడిగిండు మల్రెడ్డి.

మాసోపతికాల్ల నోల్లట్లనే మూతలు వడ్డయి.

మల్రెడ్డి తార్కిక బుద్ధికి, తను చేసే పనిమీదున్న అభిమానానికి నాకు భలే గర్వమనిపిచ్చింది. లోపల్లోపల్నే అయినెను మెచ్చుకున్న. మావోల్ల మొకాలమీన నెత్తురుచుక్క లేదు

"అబ్బ మల్రెడ్డన్న. ఏం వకీలుపాయింట్లు గుంజినవే. నువ్వు వకీలు వయ్యేదుండె" అన్న నేను.

"చదువుకుంటె మా ఐతు గావచ్చుకని ఎల్లక నాలుగోది సదువంగనే బంద్ జేసిండు బా బాపు. ఇప్పుడేమైంది పటు. ఎవ్వల ముంచకుంట నా రెక్కల కష్టంతోని ససంత్రంగ బతుకుతన్న' అనుకుంట సోపతికాల్లతోనెల్లిపెయిండు.

అల్లు పోయిన దిక్కే నోళ్ళప్పగించి సూత్తంద్రు నా సోపతికాల్లు.

సర్వ సందపలకు సృష్టికర్తలైన మల్రెడ్డి లాంటోల్లను ఈనంగ జూసెటోల్లకు మంచిగనే అయిందనుకున్న. నాకు మల్రెడ్డి మాటలల్ల డిగ్నిటీ ఆఫ్ లేబర్ కనవడ్డది. రైతుమీద జరుగుతున్న దోపిడి గురించి మల్రెడ్డి కవగాహన లేకున్నా అయినెకున్న ఆత్మవిశ్వాసం నాకెంతో మంచిగనిపిచ్చింది.